అభయమిచ్చు తల్లి.. మహాదుర్గ



దేవీ నవరాత్రులను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులతో త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి ఆలయం ఆలయం రద్దీగా మారింది. ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం మహా దుర్గ అలంకారంలో త్రిశూలం, డమరుకం ధరించి అభయ ముద్రతో దీవిస్తూ నంది వాహనంపై భక్తులకు బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారు దర్శనమిచ్చారు. తొలుత ఉభయదాతల కుంకుమార్చన.. అనంతరం ఉత్సవమూర్తి ఊరేగింపు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ, డప్పుల కోలాటం మధ్య ఆలయ ప్రాంగణంలో ఉత్సవం కనులపండువగా సాగింది. - న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

దిగ్గజానికి నలుచెరగులా నివాళి



పారిశ్రామిక దిగ్గజం, దాతృత్వశీలి, టాటాసన్స్ (గ్రూప్) గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా గురువారం నివాళి అర్పించారు. జేఆర్‌డీ టాటా నుంచి మనవైన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఆయన, తమ సంస్థలను ఉన్నత శిఖరాలకు చేర్చడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా దేశఖ్యాతిని ఇనుమడింపజేశారని, సేవాగుణంలోనూ మహోన్నతుడిగా నిలిచారని కొనియాడారు. - న్యూస్‌టుడే, చీమకుర్తి

కళారాలు.. భక్తుల కొంగు బంగారాలు



బాలాజీరావుపేటలో కనకదుర్గ అమ్మవారి గుడి.. కళారం

అంకమ్మపాలెంలోని కాళికా పరమేశ్వరి ఆలయం

నరసింహస్వామి కళారం

▶ అంబరాన్ని తాకేలా సంబరం
▶ అభయమిస్తూ సాగే ఉత్సవం
▶ దసరా వేళ ఒంగోలుకే ప్రత్యేకం

దసరా ఉత్సవాల్లో ఒంగోలుకే ప్రత్యేకమైనవి కళారాలు. శరన్నవరాత్రుల్లో అమ్మవారి అలంకరణలు, అభిషేకాలు ఒక ఎత్తైతే.. కళారాల ఊరేగింపు మరో ఎత్తు. దుర్గాష్టమి, మహార్నవమి రోజుల్లో అర్ధరాత్రి పూట నుంచి సాగే ఈ వేడుకలను కనులారా తిలకించేందుకు ఒంగోలు నగరంతో పాటు ఎక్కడెక్కడి నుంచో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కళారాలను దర్శించుకుని అమ్మవార్లకు మొక్కులు సమర్పిస్తారు. విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కళారాల మహోత్సవానికి జిల్లా కేంద్రం సిద్ధమైంది. ఈ తరుణంలో ఒంగోలుకే ప్రత్యేకమై తలమానికంగా నిలుస్తున్న ఈ వేడుక.. ప్రాశస్త్యం గురించి ఓసారి తెలుసుకుందాం... - న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఎంత రాత్రయినా తప్పని దర్శనం...

ఒంగోలులో నిర్వహించే కళారాల ఉత్సవానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. పూర్వం చిన్న గూడు బండ్లపై అమ్మవారి కళారాన్ని ఊరేగించేవారు. తప్పెట్లు వాయిస్తూ.. కాగడాలు పట్టుకుని అర్ధరాత్రి నుంచి అన్ని వీధుల్లో తెల్లవారే వరకు తిరిగేవారు. కళారాన్ని దర్శించుకుంటే మళ్లీ ఏడాది వరకూ ఎలాంటి దుష్టశక్తులు తమ దరిచేరవనేది భక్తుల నమ్మకం. తమ వీధిలోకి వచ్చిన కళారాన్ని చూసి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకునేవారు. ఇందుకోసం ఎంత రాత్రయినా సరే ఎదురుచూస్తుంటారు. కాలక్రమేణా ఉత్సవ నిర్వహణ తీరులో ఆధునికత చోటు చేసుకుంది. డీజేలు.. నృత్యాలు.. కళారూపాలు.. బాణసంచా శబ్దాలతో ఇప్పుడు ఊరేగింపు నిర్వహిస్తున్నారు.



భక్తజనం మధ్య మస్తాన్‌దర్గా కూడలిలో మూడు కళారాల కలయిక

ఇదీ స్థల పురాణం...



'యుద్ధంలో రక్తబీజుడు అనే రాక్షసుడి తలను అమ్మవారు ఖడ్గంతో ఖండించగా రక్తం ధారలుగా నేల మీద పారింది. అనంతరం ప్రతి రక్తపు చుక్క నుంచి మళ్లీ ఒక రాక్షసుడు తిరిగి పుట్టుకొస్తాడు. ఫలితంగా రోజంతా యుద్ధం చేసినా రక్త బీజుడి సంహారం పూర్తికాలేదు. అప్పుడు అమ్మవారు కాళికాదేవి అవతారమెత్తారు. పెద్ద నాలుకతో రక్తం భూమిపై పడకుండా తాగేసి రాక్షస సంహారం చేశారు. దీంతో ప్రజలంతా కాళీ కామాతకు జయ జయ ధ్వానాలు పలికి తమ మధ్యనే ఉండిపోవాలని వేడుకున్నారు. ప్రతిగా అమ్మవారు తన భక్తులకు దుష్ట శక్తుల భయం లేకుండా చేసేందుకు తన అంశతో నిలువెత్తువైన కళారాన్ని(శిరసు తెరిచి ఉన్న శిరస్సు భాగం) ప్రసాదించారు. తనతో పాటు నరసింహస్వామి కూడా కళారంగా ప్రజలకు అండగా ఉంటారని తెలిపారు...' అనేది ఇక్కడి స్థల పురాణం.

రెండు రోజులపాటు అట్టహాసం...



బాలాజీరావుపేట(కనక దుర్గాదేవి), గంటాపాలెం(పార్వతీమాత), బీవీఎస్ హాల్ కూడలి(బాలాత్రిపుర సుందరీదేవి, నరసింహస్వామి), అంకమ్మపాలెం(కాళికామాత), కేశవస్వామిపేట(మహిషాసుర మర్దిని) చోట్ల నుంచి కళారాలు ఊరేగింపుగా బయలుదేరుతాయి. నాలుగు కళారాలు పసుపు వర్ణంలో, కాళికాదేవి ఎరుపు రంగులో, నరసింహస్వామి తెల్లటి రంగులో దర్శనమిస్తుంటారు. దుర్గాష్టమి రోజు బాలాజీరావుపేట నుంచి కనకదుర్గాదేవి, బీవీఎస్ హాల్ సెంటర్ నుంచి బాలా త్రిపుర సుందరీదేవి, అంకమ్మపాలెం నుంచి కాళికామాత కళారాలను అట్టహాసంగా ఊరేగిస్తారు. దేవతామూర్తులంతా రాత్రి వేళ నగరంలోని పలు మార్గాల్లో పయనించి, తెల్లవారుజామున మస్తాన్‌దర్గా కూడలికి చేరుతారు. అక్కడ గుమికూడిన వేలాది మంది భక్తులకు దర్శన భాగ్యం కలిగిస్తారు. మహర్నవమి రోజున పార్వతీదేవి, నరసింహస్వామి, మహిషాసురమర్దిని అమ్మవార్ల కళారాల ఉత్సవం ఉంటుంది.

వసూల్ రాజాలపై క్రిమినల్ చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులు, ఉద్యోగుల బదిలీల్లో కొందరు అక్రమాలకు తెర లేపారు. నగదు ఇస్తేనే ఉత్తర్వులు అందిస్తామంటూ వసూళ్లకు బరితెగించారు. ఒక్కొక్కరి వద్ద రూ.20 నుంచి రూ.50 వేల వరకు నగదు వసూలు చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయాన్ని తెలుపుతూ 'నగదు ఇవ్వు.. లేఖ తీసుకెళ్లు' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీనిపై ఇప్పటికే కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. ఆ మేరకు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో విచారించి నివేదిక అందజేశారు. దీంతో డీపీవో కార్యాలయ జూనియర్ సహాయకుడు ఎంవీ.కిశోర్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశారు. తాజాగా డిజిటల్ సహాయకుడు పి.సాయి కోటేశ్వరరావులపై గురువారం వేటు వేశారు. అవినీతికి పాల్పడినందున పూర్వ ఏవో ఎన్.శివప్రసాద్, జూనియర్ సహాయకుడు ఎంవీ.కిశోర్‌బాబు, డిజిటల్ సహాయకుడు పి.సాయి కోటేశ్వరరావుపై అవినీతి నిరోధక చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు కోరుతూ డీపీవో జీవీ.నాయుడు ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు.

22 మంది ఎంఈవోలకు తాఖీదులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర- 2047 కార్యక్రమానికి సంబంధించి మండల స్థాయి కార్యాచరణ ప్రణాళిక సమర్పించనందుకు 22 మంది ఎంఈవోలకు జిల్లా విద్యాశాఖ అధికారిణి డి.సుభద్ర గురువారం తాఖీదులు జారీ చేశారు. స్వర్ణాంధ్ర అంశంపై ఈ నెల 5న ఒంగోలు సమగ్రశిక్షా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రణాళికతో హాజరు కావాలని కోరారు. అయితే పీసీపల్లి, నాగులుప్పలపాడు, ముండ్లమూరు, మర్రిపూడి, మద్దిపాడు, కురిచేడు, హనుమంతునిపాడు, కంభం, అర్ధవీడు, పామూరు, పొదిలి, పొన్నలూరు, తాళ్లూరు, తర్లుపాడు, త్రిపురాంతకం, వెలిగండ్ల, యర్రగొండపాలెం, దర్శి ఎంఈవో-1, 2, కొనకనమిట్ల 1, 2 ఎంఈవోలు అసలు సమావేశానికే హాజరుకాలేదు. ప్రణాళిక కూడా అందించలేదు. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా సమాధానమివ్వాలని.. లేకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని అందులో హెచ్చరించారు.

వ్యవసాయం.. పశుపోషణ తర్వాత ఎక్కువ మంది ఉపాధి పొందే రంగాల్లో చేనేత ఒకటి. జిల్లాలో 26 సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 2,910 మంది సభ్యులు ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఈ రంగాన్ని విస్మరించింది. ఫలితంగా ప్రస్తుతం అయిదు సంఘాలు మాత్రమే క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ఒక్కో సంఘంలో వందల మంది చేనేత కార్మికులు పనిచేస్తున్నారు. బేస్తవారపేట, కనిగిరి, చీమకుర్తి, ఈతముక్కల, ఉలిచి తదితర ప్రాంతాల్లో మగ్గాలు ఎక్కువ. జిల్లాలో చేనేత మగ్గాలు 867 ఉండగా.. వీటి ద్వారా ఏటా 4,960 మీటర్ల వస్త్రం తయారవుతోంది. ఆ సంఘాలు ఏటా రూ. 13 లక్షల విలువైన వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. -న్యూస్‌టుడే, కంభం

మనకూ కావాలో క్లస్టర్



▶ జిల్లాలో వందల మంది చేనేత కార్మికులు
▶ ఆదుకునే దిశగా చర్యలు ఎంతో అవసరం

▶ **గతంలో కొందరికే శిక్షణ.. పరికరాలు...:** వైకాపా హయాంలో కుదేలైన చేనేత రంగానికి తోడ్పాటునందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో కొత్తగా మరో పది చేనేత క్లస్టర్ల ఏర్పాటుకు ఇటీవల కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. అందులో భాగంగా పొరుగనున్న బాపట్ల జిల్లాలోనూ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ మన జిల్లాకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వాస్తవానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో 250 మందికి శిక్షణ ఇచ్చి, యంత్రాలు, పరికరాలు అందించారు. దీంతో వారికి మాత్రమే ప్రయోజనం చేకూరింది. మిగిలిన చాలా మందికి శిక్షణ, ఇతర ప్రయోజనాలు పొందలేకపోయారు. ఆ రంగంలో పనిచేసే చాలా మందికి సరైన శిక్షణ, ఆధునిక యంత్రాలు, పరికరాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కష్టపడి నేత నేసినా గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▶ **ఏర్పాటుతో ఎన్నో ప్రయోజనాలు...:** క్లస్టర్ ఏర్పాటైతే జిల్లాలోని కార్మికులకు ఉపాధి పెరుగుతుంది. ఒక్కో క్లస్టర్‌కు రూ. 2 కోట్ల మేర నిధులు సమకూరుతాయి. వీటిని మూడేళ్లలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. క్లస్టర్ పరిధిలోని కార్మికులకు 90 శాతం రాయితీతో మోటరైజ్డ్ జకార్డ్, ఫ్రేమ్ మగ్గం, అచ్చు సెట్, నూలు చుట్టే యంత్రాలు వంటి ఆధునిక పరికరాలు అందుతాయి. వంద శాతం రాయితీతో వ్యక్తిగత వర్క్ షెడ్డును కూడా నిర్మించి ఇస్తారు. నూతన డిజైన్లపై కార్మికులకు శిక్షణ ఇచ్చేందుకు డిజైనర్ అందుబాటులో ఉంటారు. ఇతర సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. జిల్లాలోనూ క్లస్టర్ ఏర్పాటైతే కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందని కార్మికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కిక్కు ఇవ్వని ఆదాయం

▶ గడువు పెంచినా లేదు పోటీ
▶ నేడు దరఖాస్తులకు తుదిగడువు



ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానంలో ఆదాయ కిక్కు తగ్గింది. రూ.రెండు లక్షల నాన్ రీఫండబుల్ దరఖాస్తు రుసుము ద్వారా భారీగా ఆదాయం పొందాలనే ప్రభుత్వ ఆలోచన అంతగా నెరవేరడం లేదు. అధిక రుసుము, అధికార పార్టీకి చెందిన కొందరు నేతల తీరుతో దరఖాస్తు చేసేందుకు ఆశావహులు బెంబేలెత్తుతున్నారు. ఆదాయాన్ని పెంచుకునేందుకు రెండు రోజులపాటు ప్రభుత్వం గడువు పెంచినా పరిస్థితి మెరుగు పడలేదు. బుధవారం అర్ధరాత్రి సమయానికి జిల్లాలోని 171 మద్యం దుకాణాలకు 2,165 దరఖాస్తులు వచ్చాయి. అదనంగా మరో రెండు రోజులు గడువు పెంచడంతో గురువారం నాటికి ఈ సంఖ్య అమాంతం పెరిగిపోతుందని అధికారులు అంచనా వేశారు. చివరి ఆ అంచనాలు తలకిందులయ్యాయి. ప్రతిరోజూ ఏడు వందల నుంచి వెయ్యి వరకు దరఖాస్తులు కొత్తగా దాఖలవుతుండగా.. గురువారం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపించింది. రాత్రి ఎనిమిది గంటల సమయానికి కేవలం 336 దరఖాస్తులు మాత్రమే కొత్తగా దాఖలయ్యాయి. దీంతో మొత్తం సంఖ్య 2,501కి చేరింది. తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.50.02 కోట్ల ఆదాయం సమకూరింది. చివరి రోజైన శుక్రవారం నాడైనా పరిస్థితి కాసింత ఆశాజనకంగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

తుంపర సేద్యం.. కాడెద్దుల ఊతం



కర్షకులు వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. సంప్రదాయ విధానాలు కొనసాగిస్తూనే.. సాగును సులభతరం చేసుకుంటూ మంచి దిగుబడులు సాధించడంతో పాటు.. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు కొత్తపట్నం నుంచి ఈతముక్కల వెళ్లే రహదారి పక్కన గురువారం కనిపించిన ఈ దృశ్యమే నిదర్శనం. ఓ రైతు తన పొలంలో చామదుంప సాగుకు ఉపక్రమించారు. అందుకుగాను ఓ వైపు తన కాడెద్దులతో దుక్కి దున్నుతున్నారు. ఆ వెనుకే తుంపర్ల సేద్యం పరికరాలతో మిగిలిన పంటలకు తడులు అందిస్తున్నారు. ఈ రెండు దృశ్యాలు సంప్రదాయం.. ఆధునికతల మేళవింపులా పక్కపక్కనే కనిపిస్తూ చూపరులను ఆకట్టుకున్నాయి. - ఈనాడు, ఒంగోలు

బ్యాటరీల చోరీ మీకు, మీ ఎస్పీకి తెలియదా!

▶ వై.పాలెం ఎస్సైతో కలెక్టర్ అన్సారియా

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: 'నల్లమల అడవిలోని పాలుట్లతో పాటు ఇతర గిరిజన గూడేల్లో వెలుగులు పంచేందుకు ఏర్పాటు చేసిన సోలార్ బ్యాటరీలు మాయమయ్యాయి. ఈ విషయం మీతో పాటు మీ ఎస్పీ దృష్టికి రాలేదా! ఇంతవరకు కేసు ఎందుకు నమోదు చేయలేదు? నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదు?' అని కలెక్టర్ అమీమ్ అన్సారియా వై.పాలెం ఎస్సై చౌడయ్యను ప్రశ్నించారు. పర్యటనలో భాగంగా నల్లమల అడవిలోని అల్లిపాలెం చెంచు గిరిజన గూడేన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరె రమణయ్య ఆమెతో మాట్లాడారు. పాలుట్లతో పాటు ఇతర గిరిజన గూడేల్లో ఏర్పాటు చేసిన సుమారు రూ.40 లక్షల విలువైన సోలార్ బ్యాటరీలు గత వైకాపా ప్రభుత్వ హయాంలో చోరీకి గురయ్యాయని తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని చెప్పారు. దీంతో అక్కడే ఉన్న ఎస్సై చౌడయ్యతో కలెక్టర్ మాట్లాడారు. సోలార్ బ్యాటరీల మాయం విషయం మీతో పాటు మీ ఎస్పీ దృష్టికి వచ్చిందా.. వస్తే ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి విషయం తనకు నివేదించాలని ఎస్సైని ఆదేశించారు.

పట్టం కట్టడంలోనూ నిర్లక్ష్యమేనా!

▶ ట్రిపుల్‌ఐటీల్లో జాడలేని స్నాతకోత్సవాలు
▶ ఎనిమిది వేల మంది విద్యార్థుల ఎదురుచూపు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు రెండేళ్లుగా స్నాతకోత్సవాలు నిర్వహించడం లేదు. దీంతో ఆయా ట్రిపుల్‌ఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన ఎనిమిది వేల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు. వర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 24 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్నారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీ నుంచి ఏటా వెయ్యి మంది బీటెక్ పూర్తి చేస్తున్నారు. సాధారణంగా వీటిల్లో ఏదో ఒక చోట ఏటా స్నాతకోత్సవం నిర్వహించి గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖ విశ్వవిద్యాలయాల అధ్యాపకులను అతిథులుగా ఆహ్వానించి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందిస్తుంటారు. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి ఆ ఊసేలేదు. సాధారణంగా బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆ ఏడాదే పట్టాలు అందించాల్సి ఉండగా, రెండేళ్లుగా వర్సిటీ అధికారులు ఆ విషయాన్ని మరిచారు. స్నాతకోత్సవానికి మంచి వేదిక ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తలిదండ్రులను ఆహ్వానించి ప్రముఖుల సమక్షంలో పండగ వాతావరణంలో పట్టాలు అందించాలనే అంశాన్ని పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరింది. దీనికి ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఐటీలో స్నాతకోత్సవం ఏర్పాటు అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



2022 ఫిబ్రవరి 26న ఇడుపులపాయలో నిర్వహించిన అయిదో స్నాతకోత్సవానికి హాజరైన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు(పాత చిత్రం)

రైతులను బజారుపాలు కానివ్వం

ఈనాడు కథనానికి స్పందన

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఎన్నికల నాటకంలో భాగంగా యర్రగొండపాలెంలో హడావిడిగా రైతు బజారు నిర్మించింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) నిధులు రూ.1.28 కోట్లు వెచ్చించి జన సంచారం లేని చోట.. పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసింది. బిల్లులు కూడా పూర్తిగా చెల్లించకపోవడంతో గుత్తేదారు సదరు నిర్మాణాన్ని ఏఎంసీకి కూడా అప్పగించలేదు. ఊరికి ఓ మూలగా నిర్మించడంతో ఇక్కడ విక్రయాలకు రైతులూ ముందుకు రావడం లేదు. దీంతో రైతుబజారు ప్రాంగణం నిరుపయోగంగా ఉంటూ మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ విషయాన్ని తెలుపుతూ 'రైతుల్లేరు.. రూ.కోట్లు బజారుపాలు' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 6న కథనం ప్రచురితమైంది. దీనికి కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. వై.పాలెం పర్యటనకు గురువారం వచ్చిన ఆమె రైతు బజార్ ప్రాంగణాన్ని పరిశీలించారు. మిగిలిన చిన్నపాటి పనులు పూర్తిచేసి త్వరితగతిన వినియోగంలోకి తెచ్చేలా చూడాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.



అధికారులతో కలిసి నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



గుండ్లకమ్మలో తవ్విన భారీ గుంతలు (పాత చిత్రం)

నాటి తప్పు.. నేటికీ ముప్పు

గత పాలకులు గుండ్లకమ్మనూ వదల్లేదు. నాటి వైకాపా నాయకులు యంత్రాలతో జలాశయ గర్భాన్ని యథేచ్ఛగా తవ్వేయడంతో భారీ గుంతలు పడ్డాయి. ప్రస్తుతం ఇక్కడ నీరు పెద్దఎత్తున చేరింది. పక్కనే ఉన్న గ్రోత్ సెంటర్ కార్మికులు స్నానపానాదులు నిర్వహించేందుకు ఇక్కడికే వస్తుంటారు. చుట్టుపక్కల గ్రామాల వారు ఈ జలాలను దాటితేనే తమ గమ్యస్థానాలకు వెళ్లగలరు. వారంతా ముప్పు ముంగిట విలవిల్లాడుతున్నారు. -ఈనాడు, ఒంగోలు



స్నానం చేస్తున్న కార్మికుడు



కర్ర సాయంతో లోతు చూస్తూ బిక్కుబిక్కుమంటూ వెళుతున్న మహిళ

సంపదంతా చెత్త పాల్జేశారు!

బహుళ ప్రయోజనాలు ఆశించి నెలకొల్పిన చెత్త సంపద కేంద్రాలు చెత్త పాలయ్యాయి. దీంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం.. గ్రామాలు ఆర్థికంగా బలోపేతం చేయడమన్న లక్ష్యం నీరుగారిపోయింది. గత పాలకుల నిర్లక్ష్యంతో వాటికి వెచ్చించిన నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి.

- పథకాన్ని నీరుగార్చిన గత పాలకులు
- దృష్టి సారిస్తే పల్లెలకు కాసుల కళ

న్యూస్‌టుడే, బేస్తవారపేట : స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా 2015-19 కాలంలో నాటి తెదేపా ప్రభుత్వం సంపద సృష్టి కేంద్రాలపై దృష్టి సారించింది. ఈ మేరకు ఒక్కో కేంద్రానికి రూ.5 లక్షల నుంచి 10 లక్షలు వెచ్చించింది. ఇలా జిల్లావ్యాప్తంగా వందలాది షెడ్లను నిర్మించింది. ఎంతో ముందుచూపుతో వాటిలో వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ తొట్టు ఏర్పాటు చేసింది. చెత్త సేకరణకు సైకిళ్లు, మేజర్ గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, ఆటోలను అందించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రతి ఇంటికి రెండు డబ్బాలను ఉచితంగా అందించారు. అయితే ఆ తదనంతరం వైకాపా ప్రభుత్వం కొలువుదీరాక ఈ కేంద్రాలను విస్మరించింది. దీంతో నిర్వహణ లేక కట్టడాలన్నీ శిథిలావస్థకు చేరాయి. పలు పంచాయతీల్లో వేతనాలు చెల్లించకపోవడంతో హరిత రాయబారులు (క్లాప్‌మిత్ర) విధులకు గైర్హాజరవ్వడంతో ఇవన్నీ అలంకారప్రాయంగా మిగిలాయి.



బేస్తవారపేటలోని గీతా మందిరం సమీపంలోని రహదారి పక్కన పడేసిన వ్యర్థాలు

పల్లె సీమల్ని బలోపేతం చేసేందుకు..

పల్లె సీమల్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే చెత్త సంపద కేంద్రాల ప్రధాన లక్ష్యం. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువు తయారుచేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాల్సి ఉంది. ఈ ప్రయోగం కొన్ని పంచాయతీల్లో విజయవంతమైంది. అయితే దీనిపై వైకాపా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన చెత్త నిల్వ కేంద్రాలు, సేంద్రియ ఎరువుల తయారీ తొట్టు వృథాగా ఉన్నాయి. నిర్వహణ లేక ఇవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా తయారయ్యాయి.



కలగొట్ల సమీపంలో నిరుపయోగంగా డంపింగ్ యార్డ్

పశ్చిమంలో పడకేసి..

పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో సంపద సృష్టి కేంద్రాలు ఉనికి కోల్పోయాయి. ఒకటి రెండుచోట్ల తప్ప ఎక్కడా వర్మీ కంపోస్టు తయారీ గానీ, విక్రయం గానీ చేసిన దాఖలాలు లేవు. బేస్తవారపేట పరిధిలో 19 డంపింగ్ యార్డులు పూర్తయినా పెద్ద ఓబినేనిపల్లిలో తప్ప ఎక్కడా వర్మీ కంపోస్టు తయారు చేయలేదు. దీనికితోడు జిల్లావ్యాప్తంగా క్లాప్ మిత్రలు, గ్రీన్‌గార్డ్‌ల జీతాలు నిలిపివేయడంతో ఈ పథకం మూలకు చేరింది. దీంతో చెత్తంతా ట్రాక్టర్లలో తీసుకొచ్చి డంపింగ్‌యార్డుల వద్ద వదిలేసి సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు. బేస్తవారపేటలోని గీతా మందిరం వద్ద, ఉప్పువాగు వంతెన వద్ద, సోమవారిపేట సమీపంలో రోడ్డు పక్కన కుప్పలు, కుప్పలుగా చెత్త దర్శనమిస్తోంది. కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో వీటిపై దృష్టి సారిస్తే పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తాయి. డంపింగ్‌యార్డుల వద్ద బోరు, విద్యుత్తు తదితర వసతులు కల్పించడంతో పాటు వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేసేలా ప్రభుత్వం పంచాయతీలకు దిశానిర్దేశం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వరద బాధితులకు వెలుగు

పొదిలి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పొదిలి మండలంలోని వెలుగు స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలచేత రూ.1,01,250 నగదును గురువారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పొదిలి మండలం ఏపీఎం గోపాలకృష్ణ, మార్కాపురం ఏరియా కోఆర్డినేటర్ సుదర్శన్, సీసీలు, వీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి చెక్కు అందజేస్తున్న వెలుగు అధికారులు, సిబ్బంది

పంచాయతీలను బలోపేతం చేయాలి

ఒంగోలు గ్రామీణం: గ్రామ సచివాలయాలను స్థానిక పంచాయతీల గొడుగు కిందకు తీసుకురావాలని సర్పంచుల సంఘం జిల్లా నాయకులు డీపీవో జీవీ.నాయుడును కోరారు. నూతన డీపీవో నాయుడును గ్రామ పంచాయతీ సర్పంచుల సంఘం నాయకులు గురువారం స్థానిక జిల్లా పంచాయతీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పంచాయతీలను బలోపేతం చేయడంతో పాటు, చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో భాగస్వాములుగా ఉన్న గ్రామ కార్యదర్శి, సచివాలయ వ్యవస్థలను సమన్వయం చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి, నాయకులు రాము, కె.హరిబాబు, స్వామినాథ్, సుబ్బారెడ్డి, నాగార్జున తదితరులు డీపీవోను కలిశారు.



డీపీవో జీవీ.నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా సర్పంచుల సంఘం నాయకులు

వెలుగులోకి ప్రాచీన తెలుగు శాసనం

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: మిల్లంపల్లె వేణుగోపాలస్వామి ఆలయంలోని పురాతన తెలుగు శాసనం తాజాగా వెలుగులోకి వచ్చింది. సాధారణ శకం 1440లో మిల్లంపల్లెలోని గోపినాథ దేవుడి (ప్రస్తుతం వేణుగోపాలస్వామి) ఆలయంలో నిత్యాన్నదానానికిగాను ఓ గ్రామాన్ని కానుకగా ఇచ్చారు. శ్రీమన్‌మహా మహామండలేశ్వర అనివారణ సింహారావు అనే పాలకుడు శింగరయ్య కుమారుడైన వరదరాజులుకు కొలుకులసీమలోని కూనెబోయనపల్లి (ఆవుబళపురం)ని బహుమతిగా ఇచ్చినట్టు శాసనంలో పేర్కొన్నారు. ఈ మేరకు పురావస్తు శాఖ అధికారులు నిర్ధరించినట్లు చారిత్రక పరిశోధకులు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ తెలిపారు.



జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణిగా వరలక్ష్మి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిణిగా ఎల్.వరలక్ష్మి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం పల్నాడు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిణిగా కొనసాగుతున్నారు. ప్రస్తుత జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పి.జగన్నాథరావు తూర్పు గోదావరి జిల్లా చింతూరు ఐటీడీఏ ఏపీవోగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి ఉత్తర్వులు జారీ చేశారు.

చెంచుల జీవన స్థాయి మెరుగుపరుస్తాం

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా చేపడుతున్న అభివృద్ధి పథకాల ద్వారా చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. అల్లిపాలెం చెంచుగూడెంలో 'సార్డ్స్' స్వచ్ఛంద సంస్థ రూ.26 లక్షలతో నిర్మించిన బాల ప్రకాశ భవనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. చెంచు గిరిజన చిన్నారులకు మంచి వసతి ఏర్పాటుచేసిన సంస్థకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వాలు 'జన్‌మన్' కార్యక్రమం కింద గిరిజన సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా పక్కా గృహాలు, వసతిగృహం ఏర్పాటు తదితర సమస్యలపై గిరిజనులు వినతులిచ్చారు. సర్పంచి డి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ గంజివారిపల్లె నుంచి గూడెం వరకు రోడ్డు వసతి మెరుగుపరచాలనీ.. 40 కుటుంబాలకు ఏఏవై రేషన్ కార్డులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. చిన్నారులకు ఆధార్ కార్డులు లేనందున అంగన్‌వాడీ ఆహారం అందించేందుకు సమస్యగా మారిందని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. దీంతో వెంటనే ఇక్కడ ఆధార్ క్యాంపు ఏర్పాటుచేసి సమస్య పరిష్కరించాలని ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు.

వైద్యశాల పరిశీలన : వై.పాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను కలెక్టర్‌ను సందర్శించారు. ఓపీ, ఎన్టీఆర్ వైద్యసేవ విభాగం, కాన్పుల గదులు, ల్యాబ్, ఓటీ విభాగాలు పరిశీలించారు. వైద్యశాల చుట్టూ ప్రహరీ నిర్మించి మట్టితో లెవెలింగ్ పనులు చేయాలని వైద్యశాల పర్యవేక్షకుడు ఆమె దృష్టికి తెచ్చారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్-కలెక్టర్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ బాలకిషోర్, ఇతర అధికారులు ఉన్నారు.



గిరిజన చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

భైరవకోనలో సినీ నటుడు శ్రీకాంత్ పూజలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం భైరవకోనను సినీ కథా నాయకుడు శ్రీకాంత్ గురువారం సందర్శించి పూజలు చేశారు. భైరవకోనలోని జలపాతాన్ని వీక్షించారు. కాలభైరవేశ్వర స్వామి, త్రిముఖ దుర్గాంబ, శివలింగాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న హోమం, పూజల్లో పాల్గొన్నారు. మహిషాసురమర్ధిని అలంకరణలో ఉన్న త్రిముఖ దుర్గాంబను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను దాత ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు, అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలు, పూలమాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట సినీ నిర్మాత విజయ్, క్యారెక్టర్ ఆర్టిస్టులు భూపాల్ రాజు, చిట్టి, దుబాయి బాబు ఉన్నారు.



త్రిముఖ దుర్గాంబ సన్నిధిలో శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న దాత శ్యామ్‌సుందర్‌రాజు

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 123, రిటైల్ లైవ్ - 145, చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్- 239

భారీగా బాణసంచా పట్టివేత



స్వాధీనం చేసుకున్న బాణ సంచాతో పోలీసు అధికారులు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలోని పారిశ్రామికవాడ (ఎస్టేట్)లోని వై కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న భారీ బాణసంచాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు స్థానిక డీఎస్పీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో పట్టణ ఎస్సై, సిబ్బంది ఎస్టేట్ వై కూడలి వద్ద ఆటో (ఏపీ07 టీఎఫ్3093)ను తనిఖీ చేయగా రూ.2 లక్షల విలువచేసే బాణసంచా లభ్యమైంది. దీన్ని చిలకలూరిపేట నుంచి కొనుగోలు చేసి మార్కాపురం తీసుకొస్తున్నట్లు ఆటో డ్రైవర్ షేక్ బాషా చెప్పినట్లు డీఎస్పీ వివరించారు. ఆయనిచ్చిన సమాచారంతో బాణసంచాను అధిక మొత్తంలో కొనుగోలు చేసిన పట్టణానికి చెందిన రమాకాంత్‌ని గుర్తించి వీరిద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో గురువారం సాయంత్రం ఎస్టేట్‌కు చెందిన నరసింహారావుకు సంబంధించిన ప్లాస్టిక్ గ్రాన్యువల్స్ గోదాంను తనిఖీ చేశారు. అక్కడ రూ.1.50 లక్షల విలువైన బాణసంచాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. మార్కాపురం డివిజన్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా బాణసంచా విక్రయించినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె చెల్లించక ప్రభుత్వ మద్యం దుకాణానికి తాళం

అర్థవీడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణానికి ఏడాదిగా అద్దె చెల్లించలేదని ఇంటి యజమాని గురువారం తాళం వేశారు. కాకర్ల గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణానికి గ్రామానికి చెందిన కొప్పుల వెంకటేశ్వర్లు భవనం నిర్మించి ఇచ్చారు. భవనానికి సరైన దస్త్రాలు లేవంటూ మద్యం డిపో నిర్వాహకులు ఏడాదిగా అద్దె చెల్లించడం మానేశారు. దీంతో ఆయన అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తనకు రూ.లక్షకుపైగా అద్దె నగదు చెల్లించకపోవడంతో ఆగ్రహానికి గురైన ఆయన గురువారం దుకాణానికి తాళం వేశారు. దీనిపై దుకాణం సిబ్బంది ఆబ్కారీ శాఖ సీఐ కొండారెడ్డికి సమాచారమివ్వడంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంటి యజమానికి సర్దిచెప్పారు. అద్దె విషయమై డిపో పరిధిలోని అధికారులను సంప్రదించాలని చెప్పడంతో యజమాని ఎట్టకేలకు దుకాణం తాళం తీశారు.



కాకర్లలోని మద్యం దుకాణానికి తాళం వేస్తున్న ఇంటి యజమాని

మినీ లారీ ఢీకొని ఒకరి మృతి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : మినీ లారీ ఢీకొని ఓ కూలీ దుర్మరణం పాలవ్వగా, మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన గిద్దలూరు-నంద్యాల రహదారిలో గిద్దలూరు సగిలేరు వంతెన వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాచర్ల మండలం సంగపేటకు చెందిన డి.వెంకటేశ్వర్లు (41), సోమిదేవిపల్లెకు చెందిన గురవయ్య, గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లెకు చెందిన మైలగాని ఆంజనేయులు రైల్వే పనులు చేస్తున్నారు. గురువారం ఉదయం రైల్వే ట్రాక్ పనులు చేసి గిద్దలూరు వైపునకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అదే సమయంలో నంద్యాల వైపు వెళుతున్న మినీ లారీ వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. డి.వెంకటేశ్వర్లు (41)కు వైద్యశాల పర్యవేక్షకుడు డా.ఆదాం ఆధ్వర్యంలో వైద్యాధికారులు వైద్య చికిత్సలు అందించినా పరిస్థితి విషమించి మృతిచెందారు. మైలగాని ఆంజనేయులు, గురవయ్యకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. మృతిచెందిన వెంకటేశ్వర్లుకు భార్య, పిల్లలున్నారు. ఇంటి యజమాని మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. జరిగిన సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న జడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు గ్రామీణం: ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక దక్షిణ బైపాస్‌లోని పాత జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో చిరంజీవి తెలిపారు. సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు హాజరు కావాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రేషన్ దుకాణాలపై 6ఏ కేసుల నమోదు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి 6 ఏ కేసులు నమోదు చేశారు. గురువారం మండలంలోని ఎం.వేములపాడులోని షాప్ నెంబర్ 38, పి.తక్కెళ్లపాడులోని షాప్ నెంబర్ 42లపై దాడులు చేశారు. ఎం.వేములపాడులో 60 బియ్యపు బస్తాలు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు 200 కేజీల కందిపప్పు తీసుకున్నట్లు ఉండగా, షాపులో కందిపప్పు కనిపించలేదు. పి.తక్కెళ్లపాడులో ఆరు బియ్యం బస్తాలు అదనంగా ఉన్నట్లు నిర్ధారించారు. రెండు షాపులపై 6 ఏ కేసుల నమోదు చేసినట్లు ఒంగోలు డీటీ ఫిరోజ్‌బాషా తెలిపారు. దాడుల్లో పొదిలి ఎఫ్ఐ ప్రమోద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చొరబడి రూ.లక్షన్నర సొత్తు చోరీ

మద్దిపాడు, న్యూస్‌టుడే: దుండగులు ఇంట్లో చొరబడి నగదు, బంగారం చోరీ చేశారు. ఈ సంఘటన మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్లాపల్లిలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం..తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాగేంద్ర ముత్తు స్థానికంగా ఉన్న గ్రోత్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఆయన గుండ్లాపల్లి జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 5న స్వగ్రామానికి వెళ్లారు. పనులు ముగించుకుని గురువారం ఇంటికి వచ్చి చూడగా, తలుపులు పగులగొట్టి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. లోపలికి వెళ్లగా బీరువా ధ్వంసం చేసి ఉంది. వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 19 గ్రాముల బంగారం, రూ.50 యాభై వేల నగదును దొంగలు చోరీ చేశారు. ఈ మేరకు బాధితుడు మద్దిపాడు పోలీసులకు సమాచారమివ్వగా, ఎస్సై శివరామయ్య సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిసరాలు పరిశీలించారు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించింది. చోరీకి గురైన సొత్తు విలువ రూ.లక్షన్నర ఉంటుందని బాధితుడు వాపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్త ను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మార్కాపురం

• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం


పొదిలిలో..


బేస్తవారపేటలో..


గిద్దలూరు పట్టణంలో..


యర్రగొండపాలెంలో..

దుర్గమ్మా.. శరణు శరణు

శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఎనిమిదో రోజు గురువారం త్రిపురాంతకం, బేస్తవారపేటలో, పెద్దదోర్నాలలో కంభం, రాచర్లలో, కొమరోలులో అమ్మవారు దుర్గాదేవిగా, మహాదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పొదిలి, గిద్దలూరు, మార్కాపురం పట్టణంలో, మహిషాసురమర్దినిగా, మార్కాపురం పట్టణంలోని ప్రముఖ చెన్నకేశవస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మీ వీరలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. కొమరోలులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయలో అమ్మవారిని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, పుష్పలత దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం


త్రిపురాంతకంలో దుర్గాదేవి అలంకారంలో


మార్కాపురంలో..


పెద్దదోర్నాలలో..


కంభం : దుర్గాదేవిగా వాసవీమాత

వ్యాయామంతోనే ఆరోగ్యం

త్రిపురాంతకం గ్రామీణం : శరీరంలో సంభవించే కీళ్ల నొప్పులను మాత్రలతో కాకుండా ఫిజియోథెరపీ తో తగ్గించుకోవచ్చని హైదరాబాద్ నిజామ్స్ ఫిజియోథెరపీ ఇన్స్టిట్యూట్ ఫిజియోథెరపీ వైద్యులు ఏ.మహేష్ కుమార్, వెంకట రమణ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం డేవిడ్ అధ్యక్షతన 'మందులతో కలిగే అనర్థాలు-నివారణ' సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పలు గృహ యజమానుల నుంచి పన్నులు వసూలు చేయడంలో సచివాల సిబ్బంది నిర్లక్ష్యం విడనాడి పన్ను చెల్లింపు దారులకు తగు అవగాహన కల్పించి పన్నులు వసూలు చేయడంలో లక్ష్యాలను చేరుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్.నారాయణరావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు తమ ఆస్తికి ఎంత పన్నులు చెల్లించాలి..తదితర వివరాలపై సచివాలయంలో పురపాలక సంఘం కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందిని నియమించి ఫోన్ ద్వారా లేదా స్వయంగా వచ్చిన వారికి పూర్తి స్థాయిలో సమాచారం అందిస్తామన్నారు. సకాలంలో చెల్లించాలనిఆయన కోరారు.

శనగ సాగుకు రైతుల మొగ్గు



• రాయితీపై విత్తనాలు

కంభం, న్యూస్‌టుడే:

శనగ సాగుకు నియోజకవర్గంలో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పత్తి, కంది వంటి ప్రధాన పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. రబీలో శనగకు అదును వస్తుందని కర్షకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం శనగ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. గత రబీ సీజన్‌లో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్థవీడు, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట మండలాల పరిధిలో 10,971 హెక్టార్లల్లో సాగు చేశారు. ఈయేడు 14,745 హెక్టార్లలో సాగు చేసే అవకాశం ఉంది. దసరా తర్వాత విత్తుకు సిద్ధమవుతున్నారు.

25 శాతం రాయితీ..

ప్రభుత్వ రైతులకు 25 శాతం రాయితీపై శనగ విత్తనాలు అందించే ప్రక్రియను ప్రారంభించింది. విత్తనం క్వింటా ధర రూ. 9400 కాగా 25 శాతం రాయితీ (రూ. 2350) పోనూ రూ.7050 రైతులు చెల్లించాల్సి ఉంది. అర ఎకరాకు 20 కిలోల చొప్పున ఎకరాకు 40 కిలోలు ఇస్తారు. గరిష్ఠంగా 5 ఎకరాలకు మాత్రమే రాయితీ విత్తనం అందిస్తారు. విత్తనాలు కావాల్సిన అన్నదాతలు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పొలం పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, చరవాణి నంబర్‌తో వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. రాయితీ వాటా పోగా మిగిలిన నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత విత్తనాల లోడు తెప్పించి రైతులకు అందజేస్తారు. ఈ ఏడాది అవసరాని కంటే తక్కువగా విత్తనాలు కేటాయించారు. గిద్దలూరు, మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలోని మండలాలకు 14,745 క్వింటాళ్ల విత్తనం అవసరం కాగా, 8,427 క్వింటాళ్లు కేటాయించారు. మరో 6,318 క్వింటాళ్ల విత్తనం అవసరమయ్యే అవకాశం ఉంది.

మండలం	సాగయ్యే విస్తీర్ణం (హెక్టార్లలో)	కేటాయించిన విత్తనాలు (క్వింటాళ్లలో)
గిద్దలూరు	3500	2100
రాచర్ల	1592	892
కొమరోలు	3640	2670
బేస్తవారపేట	1261	561
కంభం	1443	843
అర్థవీడు	1000	439
మార్కాపురం	1180	534
తర్లుపాడు	1068	72
పెద్దారవీడు	61	16

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం నిబంధనలు అనుసరించి రైతుల సాగుకు అవసరమైన విత్తనాలను సరఫరా చేస్తామని ఉన్నతాధికారులు తెలియజేశారు. 25 శాతం రాయితీపై విత్తనాలు అందించేందుకు ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. అవసరమైన కర్షకులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేయించుకోవాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. - బాలాజీ నాయక్, ఏడీఏ, గిద్దలూరు, మార్కాపురం

పంట నమోదు జాబితా ప్రదర్శన


చెట్టిచర్లలోని రైతుసేవా కేంద్రంలో జాబితాను ప్రదర్శిస్తున్న ఏవో మెర్సీ

బేస్తవారపేట, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల ఈ-పంట నమోదు రైతుల జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు ఏవో జక్కం మెర్సీ పేర్కొన్నారు. గురువారం మండలంలో చెట్టిచర్లలోని రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదు రైతుల జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పంట నమోదు వివరాలను జాబితాలో సరిచూసుకోవాలని ఏమైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 16లోగా రైతుసేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బిల్లుల మంజూరుకు డబ్బులు డిమాండ్ చేస్తారా?

• అధికారుల తీరుపై ధ్వజమెత్తిన ఎంపీపీ ఓసూరరెడ్డి


బేస్తవారపేట : అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ వేగినాటి ఓసూరరెడ్డి

బేస్తవారపేట, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ గృహాలకు సంబంధించిన పాత బిల్లులు మంజూరు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఎంపీపీ వేగినాటి ఓసూరరెడ్డి అధికారులపై ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, దళారులు వాటిని లారీల్లో ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నప్పటికీ వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ధ్వజమెత్తారు. ఉపాధిహామీ పథకంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని మోక్షగుండం సభ్యుడు సభ దృష్టికి తీసుకొచ్చారు.

◗ కంభం : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో వీరభద్రాచారి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పలు శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

◗ అర్థవీడు, : అర్థవీడు మండల పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేడూరి వెంకటరావు మాట్లాడుతూ గ్రామాల్లోని మౌలిక వసతులపై అధికారులు దృష్టి పెట్టాలని, చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

వంతెన కోసం తవ్వి.. వదిలేశారు


రహదారి బాగు చేయాల్సిన వంతెన ఉన్న ప్రాంతం

కంభం, న్యూస్‌టుడే: మండలంలోని తురిమెళ్ల సమీపంలో కంభం-గిద్దలూరు ప్రధాన రోడ్డుపై వెలిగొండ ప్రాజెక్టు తూర్పు ప్రధాన కాలువ కోసం రహదారిని తవ్వి వంతెన నిర్మించారు. దానికి రెండు వైపులా రోడ్డును బాగు చేయాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నా అక్కడ రహదారిని బాగు చేయలేదు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. దీని పైనుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెనకు రెండువైపులా బాగు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రహదారిని బాగు చేయించేందుకు రూ. 50 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు ఇటీవల బదిలీ అయిన రహదారులు భవనాల శాఖ డీఈ ఆనందరావు తెలిపారు. పరిశీలించి రోడ్డును బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రస్తుత డీఈ నరసింహులు చెప్పారు.

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు

పొదిలి, న్యూస్‌టుడే: మహా స్వప్నికుడు, భారతజాతి గర్వించదగ్గ పారిశ్రామిక దిగ్గజం, కష్టకాలంలో దేశ ప్రజలకు అండగా నిలిచిన మానవతావాది రతన్‌టాటా మృతి దేశ పారిశ్రామిక రంగానికి తీరని లోటు అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. రతన్‌టాటా మృతి పట్ల తీవ్ర విచారాన్ని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. దేశం నిజమైన మహానీయుడిని కోల్పోయిందన్నారు. నేటితరం యువ పారిశ్రామికవేత్తలకు ఆయన ఆదర్శప్రాయుడన్నారు.

పార్కింగ్ స్థలాలుగా ప్రభుత్వ కార్యాలయాలు..



మార్కాపురం పట్టణంలోని ట్రెజ, ఉపాధి కార్యాలయం, పాత తహసీల్దార్ కార్యాలయాలు పక్కపక్కనే ఉంటాయి. ఈ కార్యాలయాల ముందు భాగంలో చెట్లతో పాటు కొంత ఖాళీ స్థలం ఉంటుంది. వివిధ పనులపై వచ్చే వారు..అధికారుల సంబంధించిన ద్విచక్రవాహనాలను మాత్రమే అక్కడ ఉండేవి. కానీ ఇటీవల కాలంలో అది కాస్త పార్కింగ్ స్థలంగా మారిపోయింది. ఎవరు పడితే వారు అక్కడ కార్లు పార్కింగ్ చేసి వెళ్లిపోతుండటంతో కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బంది మారింది. దాదాపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్లు అక్కడే వదిలేసి పోతుండటం ఆ కార్యాలయాలకు అడ్డంకిగా మారిందని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు చర్యలు తీసుకొని అక్కడ కార్లు పార్కింగ్ చేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:



సమస్య : పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది..భయం భయంతో వారి ఇళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇబ్బందిగా ఉంది. చర్యలు తీసుకోండి. - బి.అల్లూరయ్య, పట్టణవాసి

సమాధానం: ఒక్కో ఏరియాకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నాం. కుక్కలకు ఆపరేషన్లు చేసి కట్టడి ప్రయత్నాలు చేస్తున్నాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. -చెన్నకేశవులు, మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని చింతగుంట గ్రామంలో వీధిదీపాలు మరమ్మతులకు గురయ్యాయి. రాత్రి పూట ఇబ్బందికరంగా ఉంది. - దేవయ్య, స్థానికుడు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మర్మతులు చేయిస్తాం. - శ్రీదేవి, ఈవోఆర్డీ


పేదింటి బిడ్డ.. సత్తా చాటాడు

● రాష్ట్రస్థాయి పోటీల్లో రాణింపు
● జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

చిన్నతనం నుంచి క్రీడల్లో రాణించాలన్నది ఆ పేదింటి బిడ్డ లక్ష్యం. చదువుకు ఎక్కడ ఆటంకం కలుగుతుందోనన్న తల్లిదండ్రుల సందేహం. లేదమ్మా ..నేను ఎలాగైనా జాతీయ స్థాయిలో రాణిస్తానని తల్లికి మాట ఇచ్చాడు. లక్ష్య సాధనకు కష్టపడ్డాడు. అనుకున్నది సాధించి ఆ తల్లి కల సాకారం చేశాడు. రాష్ట్ర స్థాయిలో సౌత్ జోన్ జూనియర్ ఇంటర్ సిప్ అథ్లెటిక్స్ క్రీడల్లో సత్తాచాటి సిల్వర్ పతకాలు సాధించడమే కాక జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అతనే మార్కాపురం పట్టణంలోని శివాజీనగర్ 7వ లైన్‌కు చెందిన చిన్నం ఆదినారాయణ.

మార్కాపురం, న్యూస్‌టుడే:

ఆదినారాయణ తల్లిదండ్రులు చెన్నయ్య-భ్రమరాంబలు. తండ్రి వడ్రంగి పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు.. ఆదినారాయణ మార్కాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రస్తుతం గుంటూరు ఏసీ కళాశాలలో చదువుతున్నాడు. చిన్నతనం నుండి ఆటల్లో చురుగ్గా ఉండే ఆదినారాయణ ప్రతిభను గుర్తించి వ్యాయామ ఉపాధ్యాయులు లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావలిన్‌త్రో, 200 మీటర్ల పరుగుపందె, కిలో మీటరు పరుగు, 110 ఆడిల్స్ ఇలా పలు రకాల ఆటల్లో తర్ఫీదు ఇచ్చారు. దీంతో మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో రాణించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. పాఠశాల స్థాయిలో చదువుకునే సమయంలో మార్కాపురంలోని ఎస్.ఎస్.జి. అకాడమి శిక్షకుడు తంగిరాల చిట్టిబాబు ఇతని ప్రతిభ గుర్తించి ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో మరింత రాణించే అకాశం ఏర్పడింది. ఈనెల 4-6 తేదీల్లో రాజమండ్రిలోని ఆర్ట్స్ కళాశాలలో రాష్ట్ర స్థాయిలో సౌత్ జోన్ జూనియర్ ఇంటర్ సిప్ అథ్లెటిక్స్ క్రీడలు జరిగాయి. ఈ పోటీల్లో లాంగ్ జంప్‌తో పాటు హెప్ టాత్‌లిన్‌లో ప్రతిభ కనబర్చడంతో సిల్వర్ పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 15-17 వ తేదీల్లో పంజాబ్ ఈ పోటీలు నిర్వహించనున్నారు.



అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం !



ఆటల్లో మరింతగా రాణించి మార్కాపురంతో పాటు ప్రకాశం జిల్లా, మన రాష్ట్రానికి పేరు తీసుకువస్తాను. జాతీయస్థాయి పోటీల్లో పథకం సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే నా లక్ష్యం. - చిన్నం ఆదినారాయణ

స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న బాలయ్య

మార్కాపురం: ప్రభుత్వం మద్యం దుకాణాల విషయంలో సిండికేట్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం ప్రొహిబిషన్- ఎక్సైజ్‌శాఖ సహాయ సూపరింటెండెంట్ దసరి బాలయ్య స్పష్టం చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం డివిజన్ పరిధిలోని మద్యం దుకాణాల్లో ఎవరైనా సిండికేట్‌గా మారి ప్రభుత్వానికి ఆదాయం తగ్గించే పనులు చేస్తే మాత్రం సహించేది లేదని తెలిపారు. మద్యం షాపులకు పదిలో దరఖాస్తులు వస్తే అక్కడ మళ్లీ రీ నోటిపై చేసే ఆలోచనలో ఉందన్నారు. స్వేచ్ఛగా, నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో సీఐలు ఎం.వెంకటరెడ్డి, బాషా, ఎస్సైలు పాల్గొన్నారు. ● **పొదిలి:** మద్యం దుకాణాల ఆశావాహులు, దరఖాస్తుదారులకు ఎక్సైజ్‌శాఖ పరంగా పూర్తి మద్దతు ఉంటుందని ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు కె.విజయ చెప్పారు. గురువారం పొదిలి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. సర్కిల్ పరిధిలోని దుకాణాలకు ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఆన్‌లైన్ పక్రియ ఏ విధంగా చేస్తున్నారు తదితర విషయాలను పరిశీలించారు.

వంద మందికి దుస్తుల పంపిణీ : మార్కాపురం : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక వైద్యశాలలో కంభం మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి సతీమణి ప్రమీలదేవి, కందుల ఓబులరెడ్డి ఛైర్మన్ కందుల గౌతమ్ నాగిరెడ్డిలు తన వైద్యశాలలో పని చేస్తున్న సుమారు వంద మంది వైద్యులు, వైద్య సిబ్బంది చీరలు, చొక్కా, ప్యాయింట్లను అందజేశారు.

తహసీల్దారు దాసు మృతి బాధాకరం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: అర్థవీడు తహసీల్దారు కుక్కముడి దాసు బుధవారం గుండె పోటుతో మృతిచెందడంతో ఆయన మృతదేహాన్ని పల్నాడు జిల్లా రచ్చుమల్లు గ్రామానికి తీసు కెళ్లారు. గురువారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అక్కడికి వెళ్లి దాసు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన మృతిపై తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యార్థులతో ప్రేమగా మెలగాలి


దస్త్రాలను పరిశీలిస్తున్న జడ్జి దేవేంద్రారెడ్డి

మార్కాపురం : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులపై ప్రతి ఒక్కరూ ప్రేమగా మెలగాలనిమార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి డి.దేవేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ మానసిక వికలాంగుల పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్నారు. అనంతరం వంటకు వినియోగించే నిత్యావసర వస్తువులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి పలు సూచనలు చేశారు.

మహిళా సంఘాల భవనాలకు మోక్షమెప్పుడో...!


ఆగిన స్త్రీ శిశుసంక్షేమశాఖ భవనం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో స్వయం సహాయక సంఘాల భవనం, సీడీపీవో భవన నిర్మాణాలకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో భవనాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పొదిలిలో స్త్రీ శిశు సంక్షేమశాఖ భవనానికి 2019లో రూ. 32 లక్షలతో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పనులు ప్రారంభించారు. స్లాబు వరకు పూర్తయ్యాక నిధులు అందకపోవడంతో గుత్తేదారు పనులు ఆపేశారు. అదే సమయంలో మండల స్వయం సంఘాల సమాఖ్య భవన నిర్మాణానికి సుమారు రూ.60 లక్షలతో ప్రారంభమైన రెండతస్తుల భవన నిర్మాణ పనులు మధ్యలో ఆగాయి. అప్పటి నుంచి గత ఐదేళ్లలో ఆ పనులు పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేయకపోవడంతో నిరూపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ఆ రెండు భవనాల చుట్టూ పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు మొలిచి ఉన్నాయి. మండల సమాఖ్య కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతుంది. స్వయంసహాయక సంఘాల సభ్యులు అందరూ సమావేశం కావాలంటే ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున మధ్యలో నిర్మాణాలు ఆగిన భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తయ్యేలా చేస్తే రెండు శాఖలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి నిధులు మంజూరు చేయించాలని ఆయా శాఖల ఉద్యోగులు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షకుడిగా డా. ఆదాం గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

కంభం, న్యూస్‌టుడే: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యతని సీఐ మల్లికార్జున, ఎంపీడీవో వీరభద్రాచారి అన్నారు. పట్టణంలో గురువారం ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పలు హోటళ్లు, మెకానిక్ షెడ్లు, బేకరీల్లో తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ వెట్టిచాకిరీని నిర్మూలించాలన్నారు. బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి వంటి వాటిని గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. బాలల హక్కులను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, సహాయ లేబర్ అధికారి బాలకాశీ నాయక్, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, స్వచ్ఛంద సంస్థ కార్యదర్శులు స్పీడ్ సంస్థ అధ్యక్షుడు యోబు, తదితరులు పాల్గొన్నారు.


ఓ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు, అధికారులు

జలమయమైన రహదారులు


ప్రధాన రహదారిపై నిలిచిన నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో గురువారం పలుమార్లు ఓ మోస్తరు వర్షం పడటంతో రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలో ఇటీవల రహదారికి ఇరువైపుల ఉన్న పాతకాలువల్లో పూడిక తొలగించినప్పటికీ కొన్నిచోట్ల కాలువలు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. కొత్తూరులోని ఇండేన్ గ్యాస్ కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ప్రధాన రహదారిపై నీరు నిలబడింది. వాహనచోదకులు అందులో నుంచే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. రహదారికి ఇరువైపులా దుకాణాల ముందు మట్టి తొలగించి చదును చేయడంతో దుకాణదారులు కొంత ఇబ్బంది పడుతున్నారు. ఆర్అండ్‌బీ రహదారి పరిధి వరకు తారు రోడ్డుకు సమాంతరంగా రోడ్డును చదునుచేశారు. కొన్నిచోట్ల మట్టి కుప్పలుఅలాగేఉండటంతో నీరుపోయే మార్గం లేకుండాపోయింది. పట్టణంలో ఇరువైపుల మురుగునీటి కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యారన్ల రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకోండి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి వేలం కేంద్రం పరిధిలోని పొగాకు రైతులు సకాలంలో బ్యారన్ రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించుకోవాలని వేలం కేంద్రం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 24వ తేదీ లోపల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. రూ.100 అపరాధ రుసుంతో నవంబరు 8 వరకు, రూ.400 అపరాద రుసుంతో నవంబరు 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎస్ఎల్ఎస్ పరిధిలో ఒక్కొక్క బ్యారన్‌కు 8.42 ఎకరాలు సాగు చేసుకోవాలన్నారు. ఒక్కొక్క బ్యారన్‌కు 4275 కిలోల వరకు అమ్ముకునేందుకు అనుమతించినట్లు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే:

సమస్య: సి.ఎస్.పురం గ్రామంలోని ఏనిమెట్టవీధిలోని సిమెంట్ రహదారిపై వాన కురిసిన ప్రతిసారీ వర్షపు నీరు నిలుస్తోంది. అందులో నుంచే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించగలరు.
– ఎం.నారాయణ, స్థానికుడు.

సమాధానం: నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం – వి.బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సి.ఎస్.పురం.

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని కూచిపూడి బీసీ కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో వర్షాల సమయంలో నీరు రోడ్డుపైనే నిలిచిపోతుంది. – వెంకటరావు, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వెంటనే కాలువలు శుభ్రం చేయిస్తాం.
–గాయత్రి, పంచాయతీ కార్యదర్శి

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

నాంచారపురంలో ఉచిత వైద్య శిబిరం

కురిచేడు: వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రవితేజ కుమార్ సూచించారు. మండలంలోని నాంచారపురం గ్రామంలో గురువారం జ్వరాల సర్వేతోపాటు ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి స్పందన లభించింది. మొత్తం 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మందుల పంపిణీ

దర్శి, న్యూస్‌టుడే: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాత సుబ్బారెడ్డి సహకారంతో కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మందులు, పౌష్టికాహారం, సబ్బులు, చెప్పులు అందజేశారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వెంకటరెడ్డి, గణేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

‘డబ్బులు ఇచ్చినా స్తంభాలు ఏర్పాటు చేయలేదు’



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై ఏకరవు పెట్టారు. పంచాయతీల్లో నిర్వహించే ఉపాధి గ్రామసభలు, ఇతర సమావేశాల వివరాలను అధికారులు కనీసం ప్రజాప్రతినిధులకు కూడా తెలపడం లేదని బోయమడుగుల ఎంపీటీసీ సభ్యుడు బి.తిరుపతిరెడ్డి, సర్పంచి బి.చిరంజీవి, పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఉప్పలపాడు గ్రామంలో విద్యుత్తు లైన్ ఏర్పాటుకు విద్యుత్తుశాఖ అధికారులకు పంచాయతీ నుంచి నగదు చెల్లించి ఏడాదికిపైగా అయిందని ఇప్పటికీ విద్యుత్తు స్తంభాలు వేసి లైన్ ఏర్పాటు చేయలేదని సర్పంచి వై.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. మండలంలో 23 మంది సర్పంచులకు గాను కేవలం ముగ్గురు సర్పంచులు, 13 మంది ఎంపీటీసీ సభ్యులకు ఏడుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. అధికారులు అంతంతమాత్రంగానే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎంపీపీ అసహనం వ్యక్తంచేశారు. ఎంపీడీవో షేక్ ఖాదర్‌బీ, ఎంఈవో జె.ప్రసాదరావు, ఏవో కె.రాధ, పశువైద్యాధికారి షేక్ మునీర్, ఉప తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లు తదితర శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు.

ఆక్రమణల్లో వీధులు.. కన్నీటిలో పట్టణవాసులు

❖ వర్షం వస్తే తప్పని అవస్థలు


ఉప్పురోడ్డులో మురుగు నీరు పారుతున్న దృశ్యం

చిన్నపాటి వర్షం కురిసినా చాలు కనిగిరి పట్టణంలోని వీధులన్నీ జలమయమవుతున్నాయి. రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మోకాలి లోతు నీరు చేరుతోంది. ఏటా వానకాలంలో పట్టణవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రణాళికబద్ధంగా నిర్మాణాలు లేకపోవడం.. మురుగు కాలువలు, రోడ్ల విస్తరణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం.. ఉన్నవాటిని ఆక్రమించడమే ఈ పరిస్థితికి కారణం. – న్యూస్‌టుడే, కనిగిరి


కనకపట్టణం వద్ద ఆక్రమణలకు గురైన ప్రధాన కాలువ

అనుమతుల్లేని నిర్మాణాలతో సమస్య..

కనిగిరి మున్సిపాలిటీ 50,120 మంది నివసిస్తుండగా.. సుమారు గృహాలు 14,986 ఉన్నాయి. వాటిల్లో 60 శాతానికి పైగా నిర్మాణాలకు సరైన ప్రణాళిక లేదు. మూడు నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లకు మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకున్న దాఖలాలు లేవు. ఇదే పట్టణానికి శాపంగా మారుతోంది. గతంలో విస్తరణ అవకాశాలు తక్కువగా ఉండటంతో ఉన్న కొద్దిపాటి స్థలాల్లోనే గృహాలు నిర్మించుకున్నారు. రహదారి కోసం కనీసం ఎంత స్థలం వదలాలో తెలియకుండానే నిర్మాణాలు చేపట్టారు. దీంతో పట్టణంలో దాదాపు సగం వీధుల్లో కేవలం పది నుంచి 15 అడుగుల రహదారే ఉంది. ఈ ఇరుకు దారుల్లోనే మున్సిపాలిటీ కాలువలను నిర్మించింది. ఇక వర్షాలు పడితే అంతే సంగతులు. మురుగు పొంగి ఇళ్లదుట, రోడ్లపై నిలిచిపోతోంది.

కబ్జా కోరల్లో మురుగు కాల్వలు..

కనిగిరి మున్సిపాలిటీలో సిమెంట్, కచ్చా కాల్వలు మొత్తం 135 కిలోమీటర్ల మేర ఉన్నాయి. వీటిలో అత్యధికంగా పట్టణంలోనే ఉన్నాయి. అయితే ఎవరికి వారు కాలువలను ఆక్రమించి వ్యాపారాలు, దుకాణాలు, భవనాలు నిర్మించడంతో అవి కాస్తా పూడిపోయాయి. ప్రధానంగా ఎం.ఎస్సార్‌రోడ్డు, ఉప్పురోడ్డు, తీగల గొంది, చెప్పుల బజారు, లడేసాహెబ్ వీధి, ఒంగోలు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరంతా రోడ్డు మీదకు చేరి రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి మురుగు నీరు పారేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్ మాట్లాడుతూ.. ఆక్రమణలు తొలగించి మురుగు నీరు పారేలా చేస్తామన్నారు.


ఆర్డీవో కార్యాలయం వద్ద నిలిచిన వర్షపునీరు

581 పొగాకు బేళ్ల కొనుగోలు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి వేలం కేంద్రంలో గురువారం 581 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రపడియ, నెన్నూరుపాడు, నేతివారిపాలెం, రామచంద్రాపురం, కట్టవారిపాలెం, నరసింగోలు, అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలం కేంద్రానికి 653 బేళ్ల అమ్మకానికి తీసుకురాగా, అందులో 581 బేళ్లను కొనుగోలు చేశారు. మిగిలినవి వివిధ కారణాలతో తిరస్కరించారు. చూర, ముక్క కిలో పొగాకు ధర రూ.110, కనిష్ఠ ధర రూ.30, సరాసరి ధర రూ.43.05 పలికిందన్నారు.

రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: బెంగళూరు- కడప- విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే, మైదుకూరు-సింగరాయకొండ జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల పెండింగ్ అభ్యర్థలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కనిగిరి ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు పోతున్న రైతులకు పరిహారం అందేలా చూస్తామని చెప్పారు. కార్యాలయంలో జరుగుతున్న ఫ్రీహోల్డ్ అయిన భూముల దస్త్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి, ఉప తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లు, ఏవో కె.రాధ, రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో 8.4 మి.మీ వర్షపాతం



టంగుటూరు–కొండపి రోడ్డులోని జాతీయ రహదారి వద్ద నిలిచిన వర్షపునీరు

కనిగిరి, హనుమంతునిపాడు, తాళ్లూరు, టంగుటూరు, న్యూస్‌టుడే: కనిగిరి, దర్శి, కొండపి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. హనుమంతునిపాడు మండలంలో 8.4 మి.మీ వర్షపాతం నమోదైంది. తాళ్లూరు మండలం తూర్పుగంగవరంలోని ప్రధాన వీధుల్లో పెద్ద ఎత్తున వర్షపునీరు నిలిచిపోయింది. కొండపి నియోజకవర్గంలో గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు అడపా దడపా కురవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టంగుటూరు-కొండపి రోడ్డుతో పాటు, టంగుటూరు రైల్వే అండర్‌పాస్ వంతెన సమీపంలో వర్షపుచేరి తటాకాన్ని తలపించింది.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కృషి


యాంటీ బయాటిక్స్ అందుకున్న పెంపకందారులతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిణీ బేబీరాణి

సింగరాయకొండ గ్రామీణం: రాష్ట్రంలో పాడి రైతులు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిణీ డా.బేబీరాణీ పేర్కొన్నారు. మండలంలోని బింగినపల్లి గ్రామంలో గురువారం స్థానిక పశువైద్యులు హజరత్ ఆధ్వర్యంలో పాడిరైతులు, గొర్రెలు, మేకలు పెంపకందారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులు, జీవాలకు ఎండ, వాన నుంచి రక్షణ కల్పించే షెడ్ల నిర్మాణానికి సర్కార్ 90 శాతం రాయితీపై రుణ సౌకర్యం కల్పించిందని తెలిపారు. కాలనుగుణ వ్యాధులు సోకకుండా జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు అందించాలని వైద్యులకు సూచించారు. గొర్రెలు, మేకల్లో నులి పురుగుల నివారణకు మందులు త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. సిబ్బంది రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

సందడిగా దామచర్ల కృష్ణారావు జన్మదిన వేడుకలు

టంగుటూరు, న్యూస్‌టుడే: ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు తండ్రి దామచర్ల కృష్ణారావు జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు సందడిగా నిర్వహించారు. మండలంలోని తూర్పు నాయుడుపాలెంలోని ఆయన స్వగృహంలో గురువారం తెదేపా సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, అన్నపూర్ణమ్మలు కృష్ణారావు దంపతులకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

చోదక పాఠశాల నిర్మాణానికి వినతి


మంత్రి రాంప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెదేపా నాయకురాలు లక్ష్మి

దర్శి, న్యూస్‌టుడే: దర్శిలో జాతీయ చోదక పాఠశాల కల సాకారం కాబోతుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర రవాణ శాఖ మండపల్లి రాంప్రసాదరెడ్డిని లక్ష్మి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దర్శిలో నిలిచిన చోదక పాఠశాల నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించటానికి నిధులు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని ఆమె కోరారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీఓగా సుందరరామయ్య

తాళ్లూరు : తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయం ఈఓఆర్డీ కె.సుందరరామయ్యను పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జి ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా పరిషత్తు సీఈవో బి.చిరంజీవి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి ఎంపీడీవో కె.యుగ కీర్తిని గుంటూరు జిల్లాకు బదిలీ కావడంతో ఖాళీ ఏర్పడింది. అయితే ఇప్పటివరకూ కార్యాలయం ఏఓ ఎస్.సత్యం ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం

దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీనారాయణపురంలో గుండెపోటుతో మృతి చెందిన తెదేపా కార్యకర్త వెంకటయ్య మృతికి నాయకులు గురువారం నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగరపంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, తదితరులు గ్రామానికి వెళ్లి కార్యకర్త మృతదేహానికి సందర్శించి బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు.

వెలిగొండ పూర్తికి త్వరలో మలిదశ ఉద్యమం

కనిగిరి, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రకాశం ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం మలి దశ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పేర్కొన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో గురువారం పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ శంకుస్థాపన చేసి 28 ఏళ్లైనా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్ట్‌ను పూర్తి చేయలేకపోయాయని విమర్శించారు. అందుకే సీపీఐ మలి దశ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయ్యేంత వరకు పోరాటం చేస్తామన్నారు. నవంబరు18న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రవీంద్రబాబు, నాయకులు యాసిన్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

పాహిమాం.. మహిషాసుర మర్దిని


దొనకొండ: ప్రత్యేకాలంకరణలో


టంగుటూరు: దుర్గాదేవిగా వల్లూరమ్మ తల్లి


దర్శిలో వనదుర్గగా పోలేరమ్మ..


కనిగిరి పట్టణంలో అమ్మవారు..


ముండ్లమూరు: మారెళ్లలో మహాకాళీగా..


కొండపి: కె.ఉప్పలపాడు గ్రామంలో..


తాళ్లూరు: గంగ భవాని అమ్మవారు


సింగరాయకొండలో జాలమ్మతల్లి


భైరవకోనలో మహిషాసుర మర్దిని అలంకరణలో త్రిముఖ దుర్గాంబ


పామూరులో ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

న్యూస్‌టుడే బృందం: దసరా శరన్నరాత్రుల్లో వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు దుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనిగిరి పట్టణంలోని కనకదుర్గమ్మ కోవెల, పోలేరమ్మ, అంకాళేశ్వరి దేవస్థానాల్లో బాలకోటేశ్వర దేవస్థానాల్లో అమ్మవారికి మహిళలు కుంకుమార్చనలు చేశారు. ఆయా దేవస్థానాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దొనకొండ మండలంలోని చందవరంలోని అంకాలపరమేశ్వరి ఆలయంలో గణపతిపూజ, పుణ్యావాచకం, మంత్రపుష్పం, మహాన్యాసపూర్వకం పూజలు నిర్వహించారు. సింగరాయకొండలోని జాలమ్మతల్లి ఆలయంలో మహిళా భక్తులు సామూహిక వ్రతాలు నిర్వహించారు. శైవ పుణ్యక్షేత్రం భైరవకోనలో త్రిముఖ దుర్గాంబ, పామూరులో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు మహిషాసురమర్దిని అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు.


పామూరులో పూజలు చేస్తున్న భక్తులు

లోపాలు గుర్తించి.. లాభాల బాట పట్టించి..

❖ విస్తృతంగా పొలం పిలుస్తోంది


టంగుటూరు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టంగుటూరు, జరుగుమల్లి, న్యూస్‌టుడే:

వ్యవసాయంలో రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి రాష్ట్రప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. పెట్టుబడులు తగ్గించి పంట దిగుబడి, ఆదాయం పెంచడమే ధ్యేయంగా అధికారులు పొలం బాట పట్టారు. కొండపి నియోజకవర్గంలో ఇప్పటికే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అన్నదాతల సమన్వయంతో అధికారులు శరవేగంగా నిర్వహిస్తున్నారు.

ఉదయం పరిశీలన.. మధ్యాహ్నం గ్రామసభలు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కమిషనర్ల నుంచి క్షేత్రస్థాయి అధికారులు పొలంబాట పట్టాలని నిర్ణయించారు. ప్రతి వారంలో మంగళ, బుధవారం (రెండు రోజుల పాటు) అధికారులు, సిబ్బంది ఉదయం క్షేత్రస్థాయి పర్యటన, మధ్యాహ్నం గ్రామాల్లో రైతులతో గ్రామసభలు నిర్వహిస్తారు. ఎంపిక చేసిన రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ.. అందులో వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, మార్కెటింగ్, ఆత్మ డెయిరీ, మత్స్య ఇతర విభాగాల అధికారులు పాల్గొనేలా చర్యలు చేపడతారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి చీడపీడలను, వైరస్‌లను సకాలంలో గుర్తిస్తారు. వ్యాధి ఏ దశలో ఉంది.. విరుగుడు కోసం ఏం చేయాలి అనే అంశాలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్తారు. అలాగే బిందు, తుంపర సేద్యం విధానంలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తారు. రైతు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా పంట పెట్టుబడులకు రుణాల మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి డ్రోన్ టెక్నాలజీ, విత్తన శుద్ధి తదితర అంశాలను వివరిస్తారు.

ప్రణాళిక ప్రకారం సాగుతూ..

టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు, మర్రిపూడి మండలాల వారీగా 90 రైతు సేవా కేంద్రాలున్నాయి. పొలం పిలుస్తోంది కార్యక్రమం ఖరీఫ్ నాలుగు నెలలు, రబీలో నాలుగు నెలల పాటు చేపట్టనున్నారు. ప్రతీ మండలంలో ఏ గ్రామంలో ఏ రోజున కార్యక్రమం నిర్వహించాలనే దానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. ప్రతీ రైతు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసేందుకు ముందస్తుగానే సమాచారం ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

సందేహాలను నివృత్తి చేసుకోవాలి..

ఆయా శాఖల్లో సాగు చేసే పంటలపై ఆధునిక సేద్య విధానాలను అన్నదాతలకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టింది. వ్యవసాయ శాఖతో పాటు పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ ఇతర అనుబంధ శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరవుతారు. రైతులందరూ కార్యక్రమంలో భాగస్వాములై సందేహాలను నివృత్తి చేసుకోవాలి. – నిర్మలా కుమారి, సింగరాయకొండ వ్యవసాయ సహాయ సంచాలకురాలు

కేజీబీవీల్లో నియామకానికి దరఖాస్తులు

సి.ఎస్.పురం: సమగ్రశిక్ష ద్వారా నిర్వహిస్తున్న సి.ఎస్.పురం, శీలంవారిపల్లి కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది నియామకానికి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రాజాల కొండారెడ్డి తెలిపారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఈ నియామకాలు చేపడుతున్నట్లు చెప్పారు. సి.ఎస్.పురం టైప్-3 కేజీబీవీలో ప్రధాన వంట మనిషి పోస్టు 1, శీలంవారిపల్లి టైప్-4 కేజీబీవీలో చౌకీదార్ 1, ప్రధాన వంట మనిషి, సహాయ వంట మనిషి ఒకరు చొప్పున మండలంలో మొత్తం నాలుగు పోస్టులు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టులకు ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదని, 18 ఏళ్ల నుంచి 42 సంవత్సరాల వయసు మధ్యగల మహిళలు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీలోపు సి.ఎస్.పురం మండల విద్యాశాఖాధి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

తాళ్లూరు: తాళ్లూరులోని టైప్-3 కేజీబీవీకి సంబంధించి వాచ్ ఉమన్, టైప్-4కి సంబంధించిన చౌకీదారు, హెడ్‌కుక్‌తోపాటు సహాయ కుక్ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తుల చేసుకోవాలని ఎంఈఓలు జీవి.సుబ్బయ్య, ఎల్.సుధాకరరావులు కోరారు.

బౌద్ధ ఉత్సవాల యాత్ర జయప్రదానికి పిలుపు


గోడప్రతులు విడుదల చేస్తున్న దళిత రైట్స్ ఫెడరేషన్ సంస్థ నిర్వాహకులు

టంగుటూరు, న్యూస్‌టుడే: జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామంలో ఈ నెల 12న నిర్వహించే బౌద్ధ ఉత్సవాల ముగింపు యాత్రలో ప్రతీ ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని దళిత రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు తెలిపారు. అశోక విజయ దశమిని పురస్కరించుకొని ఈ నెల 3న ప్రారంభించిన బౌద్ధ ఉత్సవాలు అక్టోబర్ 12తో ముగియనున్నాయి. యాత్ర విజయోత్సాహాన్ని పురస్కరించుకుని గురువారం టంగుటూరులో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సుదర్శన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

విద్యార్థినికి ఎమ్మెల్యే సాయం



విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులతో ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు ఎస్సీ కాలనీకి చెందిన మున్నంగి సుమ నీట్ ఫలితాల్లో ప్రతిభ చాటి గుంటూరు వైద్య కళాశాలలో సీటు సాధించారు. పేద కుటుంబం కావడంతో చేరేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. విషయం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో... ఆయన వెంటనే స్పందించి గురువారం రూ.50 వేల సాయం అందజేశారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థిని తల్లిదండ్రులు రవితేజ, ఆనందకుమారి కూలి పనులు చేస్తూ కుమార్తెను బాగా చదివించారు. తోడ్పాటు అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్తు సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు సత్వర సేవలు అందించాలని ఈఈ హరిబాబు పేర్కొన్నారు. ఒంగోలు డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై డీఈ, ఏఈలతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేసవి సీజన్ రానున్న దృష్ట్యా ఎక్కడైనా లో ఒల్టేజీ సమస్య లుంటే తక్షణమే ప్రతిపాదనలు పంపాలన్నారు. జాప్యం లేకుండా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు మంజూరు చేయాలని ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకంపై గృహ వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: గత ఏడాది పదో తరగతిలో 500కు పైగా మార్కులు; ఇంటర్‌లో 900కు పైగా మార్కులు సాధించిన చేనేత విద్యార్థులను... చీమకుర్తి పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ సంచాలకులు ఎస్. రఘునందన్, చేనేత అభివృద్ధి అధికారి అనుముల వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి వారికి జ్ఞాపికలు అందజేశారు. దోమల పుల్లయ్య, చంద్ర, శేషాద్రి, చినవెంకటేశ్వర్లు, ఆంజనేయులు, లక్ష్మీజ్యోతి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు వేగవంతం

చీమకుర్తి: అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య సూచించారు. పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పట్టణ స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి, విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు మంజూరు చేయాలన్నారు. సిటీ మిషన్ మేనేజర్ రఘు, ఆయా బ్యాంకుల ప్రతినిధులు సునీత, మదన్, సంపత్ కుమార్, పి.రాజేశ్వరి, ఎ.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై సమీక్ష

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ చెన్నరాయుడు పేర్కొన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఇంజినీరింగ్ సహాయకులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన గ్రామాల్లో వివిధ దశల్లో నిలిచిన నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తుందన్నారు. వచ్చే ఏడాది మార్చి కల్లా లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. ఇన్‌ఛార్జి ఏఈ రాజేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లాజర్, శ్రీను పాల్గొన్నారు.

విజిలెన్స్ సీఐగా అపర్ణ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌గా నూతలపాటి సాయి అపర్ణ నియమితులయ్యారు. ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించాక... ఆ శాఖ అదనపు ఎస్పీ కులశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఆమె ఒంగోలులోనే అవినీతి నిరోధక శాఖ సీఐగా విధులు నిర్వహించారు.



చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

రతన్ టాటాకు నివాళి

చీమకుర్తి, న్యూస్‌టుడే: మనసున్న వ్యాపార దిగ్గజం రతన్ టాటా అని వక్తలు కీర్తించారు. ఆయన అస్తమయంతో చీమకుర్తిలోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం అంజలి ఘటించారు. రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కందుకూరి సుధాకర్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు శిద్దా సుధాకర్, కార్యదర్శి మద్ది వెంకట్రావు, తెదేపా నాయకుడు మన్నం ప్రసాదరావు తదితరులు అంజలి ఘటించారు.

గ్రోత్ సెంటర్ గొంతు నొక్కేశారు!

● గత పాలకుల నిర్లక్ష్యంతో కళ కోల్పోయిన పారిశ్రామికవాడ ● కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని యజమానుల వినతి



మూతపడ్డ ఓ గ్రానైట్ పరిశ్రమ

న్యూస్‌టుడే, మద్దిపాడు

వందలాది పరిశ్రమలతో కళకళలాడిన గుండ్లపల్లి గ్రోత్ సెంటర్... గత వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో నేడు వెలవెలబోతోంది. నిండా సమస్యలు పేరుకుపోయి సగానికి పైగా పరిశ్రమలు మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించి పూర్వవైభవం దిశగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల యజమానులు కోరుతున్నారు.



కార్యకలాపాలు నిలిపేసిన అల్యూమినియం కర్మాగారం

విద్యుత్తు, పన్నుల భారం...



ఏపీఐఐసీ కార్యాలయం

తెదేపా హయాంలో ఔత్సాహికులకు పలు రాయితీలు కల్పించి యూనిట్లు ఏర్పాటును ప్రోత్సహించేలా పారిశ్రామిక విధానం ఉండేది. వైకాపా అధికారంలోకి వచ్చాక అది గాడితప్పింది. గ్రోత్‌సెంటర్‌లో ఉన్న పరిశ్రమల్లో ఎక్కువ శాతం గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లే. వీటికి రాయితీల మాట అటుంచితే... రాయల్టీ, విద్యుత్తు బిల్లు భారం పెంచింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే విద్యుత్తు బిల్లు యూనిట్‌పై రెండు నుంచి మూడు రూపాయలు తేడా ఉండేది. క్వారీలపైనా పరోక్షంగా పెత్తనం చెలాయించడంతో ముడి రాయి లభ్యత తగ్గింది. అంతిమంగా ఉత్పత్తి వ్యయం తడిసి మోపెడై కర్మాగారాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగానే 130కు పైగా ఉన్న పాలిషింగ్ యూనిట్లలో 80కి పైగా మూతపడ్డాయి. విద్యుత్తు భారంతో పాటు సరఫరా సైతం అస్తవ్యస్తంగా మారడంతో సిలికామల్ కర్మల తయారీ సంస్థ ఇక్కడి నుంచి తరలిపోయింది. ఇదే తరహాలో మరో 80 వరకు సంస్థలు కార్యకలాపాలు నిలిపేశాయి.

గుండ్లపల్లి పారిశ్రామికవాడలోని కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 11 వేల మంది వరకు ఉపాధి పొందేవారు. చిరు వ్యాపారాలు, ఇతర కార్యకలాపాల ద్వారా మరో రెండు వేల మందికి జీవనోపాధి లభించేది. వైకాపా అస్తవ్యస్త విధానాలతో సగానికి పైగా పరిశ్రమలు మూతపడడంతో... ప్రస్తుతం రెండు వేల మందికి మించి పనులు దొరకడం లేదు.

గ్రోత్‌సెంటర్ వివరాలు (సుమారుగా)...

674	పారిశ్రామికవాడలోని మొత్తం ప్లాట్లు
370	2019 నాటికి కార్యకలాపాలు నిర్వహిస్తున్న యూనిట్లు
220	గత అయిదేళ్లలో మూత పడిన కంపెనీలు
150	ప్రస్తుతం నడుస్తున్న కర్మాగారాలు

దాదాపు ఏడాది క్రితం అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో... ఐలా కార్యవర్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా తరువాత అది ఆచరణకు నోచలేదు. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు... తెదేపా హయాంలో అమలు చేసిన రాయితీలు పునరుద్ధరించాలని యజమానులు కోరుతున్నారు.

నిర్వహణ గాలికొదిలేశారు...

గత అయిదేళ్లుగా ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) కార్యవర్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. దీంతో పారిశ్రామికవాడ నిర్వహణ చూసేవారు కరవయ్యారు. కనీస మరమ్మతులు లేక అంతర్గత రహదారులు నిండా గోతులతో ఛిద్రమయ్యాయి. వర్షాల సమయంలో వాటిలో నీరు చేరి పరిస్థితి మరింత దిగజారుతోంది. ఉత్పత్తులు తరలించే భారీ వాహనాలతో పాటు... యజమానులు, కార్మికులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి వాటి కొమ్మలు రహదారులపైకి విస్తరించాయి. డివైడర్లపైనా పచ్చదనం హరించుకుపోయి పిచ్చి మొక్కలు మొలిచాయి. కాలువలు సంగతి సరేసరి. జమ్ము పెరిగి ఆనవాళ్లు లేకుండా పోయాయి. దీంతో ఆయా పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలు రహదారులపైనే పారుతున్నాయి. చివరకు, వీధి దీపాలు దెబ్బతిన్నా పట్టించుకునే దిక్కులేక... సాయంత్రమైతే అంధకారం నెలకొని అవస్థలు తప్పడం లేదు. గ్రోత్‌సెంటర్ నిర్వహణ పేరిట ఆయా పరిశ్రమల నుంచి పన్నులు వసూలు చేస్తున్నా... ఎంత మొత్తం వసూలైంది, ఏ పనులకు ఖర్చు చేస్తున్నారన్న వివరాలూ అందుబాటులో ఉండడం లేదు.



గ్రోత్‌సెంటర్ లోపలి రహదారి తీరిది

కలెక్టరేట్ యూనిట్ ఎన్నికల వాయిదాకు వినతి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ యూనిట్ ఎన్నికలు వాయిదా వేయాలని... ఎన్నికల అధికారి, డీటీ కె.వెంకటేశ్వర్లుకు రెవెన్యూ ఉద్యోగులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 11 నుంచి 13 వరకు ప్రభుత్వ సెలవులని... ఈ నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణకు 14 తుది గడువుగా ప్రకటించడం సరికాదన్నారు. ఎన్నికల ప్రకటన సైతం రహస్యంగా ఇచ్చారని ఆరోపించారు. అర్హుల ఓట్లు తొలగించారని... వాటిని పునరుద్ధరించాలని కోరారు. కొత్తపట్నం, దర్శి తహసీల్దార్లు పి.మధుసూదనరావు, శ్రావణ్, డీటీలు వాసుదేవరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో భూపతి చిరంజీవి గురువారం సందర్శించారు. ఎంపీడీవో మహాలక్ష్మి, సిబ్బందితో సమావేశమై పలు అంశాలు చర్చించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సూపరింటెండెంట్ దక్షిణామూర్తి, సీనియర్ అసిస్టెంట్ ప్రసూన పాల్గొన్నారు.

చీర్వానుప్పలపాడులో డ్వామా పీడీ విచారణ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన పండ్ల తోటలు వివిధ కారణాలతో చనిపోయినా అధికారులు తమ నుంచి నిధులు రికవరీ చేశారని... చీర్వానుప్పలపాడుకు చెందిన మేడికొండ మురళి గత నెల 12న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ గురువారం గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు, ఉపాధి సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు.

దయచూపు దుర్గమ్మ!



పెళ్లూరు: దుర్గాదేవిగా జ్వాలాముఖి



చెన్నయ్య సేవలో ఎమ్మెల్యే దామచర్ల, కుటుంబీకులు



కన్యకా పరమేశ్వరి ఆలయంలో



కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో...



లాయర్‌పేట బాబా మందిరంలో



చెన్నకేశవస్వామి ఆలయంలో...

దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం... అమ్మవారు కనక దుర్గమ్మ అవతారంలో భక్తులను కటాక్షించారు. ఆయా ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమార్చనలు, లలితా సహస్ర నామార్చనలు నిర్వహించారు. శ్రీగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం తోమాల సేవ జరిపారు. సాయంత్రం... హనుమంత వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి మలయప్పస్వామి ఊరేగారు.

– న్యూస్‌టుడే బృందం



సంతపేట: బాబా జీవిత చరిత్ర ప్రదర్శన



హరిహర క్షేత్రంలో



శ్రీగిరిలో హనుమంత వాహనంపై శ్రీవారు

ప్రమాదాల నివారణకు చర్యలు



డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న ఎస్సై శివరామయ్య

మద్దిపాడు, న్యూస్‌టుడే: పదహారో నంబరు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ దిశగా మద్దిపాడు పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఎస్సై శివరామయ్య ఆధ్వర్యంలో... బుధవారం అర్ధరాత్రి రెండు గంటల తరువాత లారీలు, ఇతర వాహనాలను ఆపి డ్రైవర్లతో ముఖం కడిగించారు. కచ్చితంగా రహదారి నిబంధనలు పాటించాలన్నారు. శిరస్త్రాణం ధరించాలని ద్విచక్ర వాహనదారులకు, సీటు బెల్ట్ ధరించాలని కార్లలో ప్రయాణించే వారికి సూచించారు. ప్రమాదాల నివారణలో భాగంగా ముఖ్య కూడళ్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

?: మంగమూరు రోడ్డు నుంచి సమతానగర్‌కు వెళ్లే దారిలో రెండు, మస్తాన్ దర్గా వద్ద కృష్ణ మందిరం ఎదురుగా మరో వీధి దీపం వెలగడం లేదు. – కృష్ణ, వెంకటేశ్వర్లు, స్థానికులు

✓: సిబ్బందిని పంపి రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం. – చంద్రయ్య, మున్సిపల్ ఇంజినీర్

నీటి సరఫరా పునరుద్ధరణ

స్పందనకు వందనం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: పంపుహౌస్‌లోని మోటార్లు దెబ్బతిని నగరంలోని 24, 25 డివిజన్లలోని పలు ప్రాంతాలకు వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యను కొందరు స్థానికులు 'ఈనాడు మేమున్నాం... మీకు తోడుగా'కు తెలిజేయడంతో ఈ నెల 9న ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సమస్యను సరిచేసి గురువారం ఉదయం సరఫరా పునరుద్ధరించారు.

కాలువలో పూడిక తొలగింపు

చీమకుర్తి, న్యూస్‌టుడే: సూర్యనగర్ ప్రధాన కాలువలో మురుగు పేరుకుపోయి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. విషయం 'ఈనాడు'లో గురువారం ప్రచురితం కావడంతో... మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ స్పందించి కాలువలు శుభ్రం చేయించారు.

భావోద్వేగాల నియంత్రణతో మానసిక ఆరోగ్యం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆందోళన, కోపం, బాధ వంటి భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం ద్వారా మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాగీరథి తెలిపారు. లేని పక్షంలో రక్తపోటు, మధుమేహం, గుండెపోటు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య, దృష్టి దినోత్సవాలను పురస్కరించుకుని జిల్లా జైలు ఖైదీలకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కుని మానసిక వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కుంగుబాటుకు గురిచేసే భావోద్వేగాల నుంచి బయటపడేందుకు ఆటలు, యోగా వంటి వ్యాయామాలు, పుస్తకాలు చదవడం అలవరచుకోవాలన్నారు. ఖైదీల్లో 40 శాతం మంది మానసిక అనారోగ్యంతో ఉన్నారని సైకియాట్రిస్ట్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. జరిగిన విషయాలను తలచుకొని బాధపడటం కంటే జైలులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చేతివృత్తుల్లో రాణించాలని సూచించారు. కంటి ఆరోగ్యం కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ నళిని వివరించారు. ఖైదీల్లో సత్ప్రవర్తన కోసం రోజూ యోగా చేయిస్తున్నట్లు జైలు పర్యవేక్షణాధికారి వరుణారెడ్డి తెలిపారు. త్వరలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యులు సురేష్‌కుమార్, సూరిబాబు, బ్రహ్మతేజ, జైలర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ భాగీరథి

కిక్కు తెచ్చిన చిక్కు



పూటుగా మద్యం తాగిన వ్యక్తి ఆ మత్తులో జోగుతూ రోడ్డుపైకి వచ్చాడు. వచ్చిపోయే భారీ వాహనాలకు అడ్డంగా వెళ్లి... వాటిని ఆపి నానా యాగీ చేశాడు. అతడిని తప్పించి ముందుకు వెళ్లేందుకు వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. ఏదైనా ప్రమాదం జరుగుతుందన్న ఆందోళనతో చుట్టుపక్కల వారు అతడిని వారించినా వినలేదు. మంగమూరు రోడ్డు కూడలిలో గురువారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇరవై నిమిషాల పాటు హడావుడి చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

వ్యతిరేకమార్గం... మిగిల్చింది కష్టం



మంగమూరు కూడలి నుంచి ఆస్టర్ రమేష్ ఆసుపత్రి కూడలి వరకు... పాత జాతీయ రహదారిలో భారీ వాహనాల రాకపోకలు తగ్గాయి. ఇదే సమయంలో రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు పెరిగాయి. గురువారం సాయంత్రం... ఓ మట్టి లోడు ట్రాక్టర్ ఇలా వ్యతిరేక మార్గంలోనే వెళ్తూ రోడ్డు పక్కనున్న బురద గుంతలో చిక్కుకుపోయింది. ఎంత ప్రయత్నించినా ముందుకు కదలక పోవడంతో డ్రైవర్... రోడ్డు పక్కనే ఆ మట్టి పడేశారు. అయినా ఫలితం లేకపోవడంతో మరో ట్రాక్టర్‌ను రప్పించి బయటకు తీశారు.

– ఈనాడు, ఒంగోలు